# జోరుగా.. హుషారుగా..

**చేవెళ్ల మండలంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రచారం**

**మన్నెగూడలో బూత్ స్థాయి కార్యకర్తలతో మంత్రి హరీశ్‌రావు, కందుకూరులో పార్టీ శ్రేణులతో మంత్రి సబితారెడ్డి సమావేశం**

**ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు మద్దతుగా చంద్రధనలో ప్రచారం చేసిన మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్**



చేవెళ్ల రూరల్: ఊరెళ్ల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



వెల్దండ మండలంలోని అజిలాపూర్‌లో కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

రంగారెడ్డి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతోపాటు పార్టీ శ్రేణులు అలుపెరగకుండా జిల్లాలో ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. గ్రామ గ్రామాన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రజానీకం సైతం అడుగడుగునా ఘన స్వాగతం పలుకుతున్నది. మరోవైపు ఎన్నికల సన్నాహ కార్యక్రమాలు సైతం ఊపందుకున్నాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మన్నెగూడలో శుక్రవారం జరిగిన బూత్ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు పాల్గొని ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి పార్టీ శ్రేణులతో భారీ సమావేశాన్ని నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ప్రచారాన్ని నిర్వ హించారు. చేవెళ్ల మండలంలోని ఊరెళ్ల గ్రామంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

### గులాబీ పార్టీకి తిరుగులేని మద్దతు

జిల్లాలో ప్రతిపక్ష పార్టీలు చతికిల పడగా బీఆర్ఎస్ పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతున్నది. అసెంబ్లీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర ఏ ఎన్నికలైనా సబ్బండ వర్ణాలు బీఆర్ఎస్ పార్టీకే అండగా ఉంటూ వస్తున్నారు.

ఈసారి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్నది. ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొని జై కొడుతున్నారు. గుండెగుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయిన గులాబీ పార్టీకి ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ పట్టంకట్టి జిల్లాలోని అన్ని స్థానాల్లో గెలిపించేందుకు ప్రజానీకం ఉవ్విళ్లూరుతున్నది.

# గొంతు నులిమి చంపి..వాగులో పడేసి

- తల్లిని చంపిన కసాయి
- అప్పుల వాళ్లు ఇంటికొస్తున్నారనే దురాగతం
- మరొకరి సాయంతో శవాన్ని జుట్టివాగులో..
- అన్న నిలదీయడంతో విషయం వెలుగులోకి





మృతురాలు అంజమ్మ (ఫైల్), నిందితుడు వెంకటేశ్

బషీరాబాద్, అక్టోబర్ 27 : అప్పుల వాళ్లు ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నారని.. అందుకు కారణం అమ్మేనని భావించిన ప్రబుద్ధుడు గొంతు నులిమి చంపి ఆపై ముట్టగా కట్టి జుట్టివాగులో పడేసిన ఘటన మండలంలోని కాశీంపూర్ గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ కథనం ప్రకారం.. కాశీంపూర్ గ్రామానికి చెందిన అంజమ్మ(55)కు ఇద్దరు కుమారులు సతీశ్, వెంకటేశ్ ఉన్నారు. పెద్దకొడుకు ఖాజాపూర్‌లో జీవిస్తుండగా..చిన్న కొడుకు వెంకటేశ్ మృతురాలితో కలిసి కాశీంపూర్‌లో నివసిస్తున్నాడు. అంజమ్మ తాండూరులో కూరగాయలు విక్రయిస్తుంది. వెంకటేశ్ హైదరాబాద్‌లో మేస్త్రీ చేతికింద పనిచేస్తూ దసరా పండుగకు ఇంటికి వచ్చాడు. అయితే గతంలో ఇంటి నిర్మాణం సమయంలో అప్పులు ఇచ్చిన వారు వెంకటేశ్ ఇంటికి వచ్చిన విషయం తెలుసుకుని అప్పుల విషయమై నిలదీశారు. దీంతో గ్రామస్తులు కలుగజేసుకుని వారికి నచ్చజెప్పి పంపించారు. ఈ విషయమై అదే రోజు రాత్రి తల్లితో గొడవపడ్డాడు. ఆగ్రహంతో తొయగ ఆమె కింద పడగా గొంతు నులిమి చంపినట్లు ఎస్ఐ తెలిపారు. శవాన్ని మరొకరి సాయంతో గ్రామ శివారులోని జుట్టివాగులో పడేశాడు. అయితే అంజమ్మ అంతకుముందు రోజు పెద్ద కొడుకుతో మాట్లాడి పండుగ మరుసటి రోజు ఖాజాపూర్‌కు వస్తానని చెప్పింది. అయితే తల్లి తన దగ్గరకు రాకపోవడంతో సతీశ్ తమ్ముడైనా వెంకటేశ్‌కు ఫోన్ చేసి అమ్మ నా వద్దకు వస్తానని చెప్పింది ఇంకా రాలేదని అడుగగా నాకు తెలియదని అతడు సమాధానమిచ్చాడు. బంధువులు, తెలిసిన వారిని సతీశ్ ఆరా తీసినా మా వద్దకు రాలేదన్నారు. తమ్ముడిని గట్టిగా నిలదీయగా అమ్మతో గొడవపడి గొంతు నులిమి చంపి, జుట్టివాగులో పడేసినట్లు చెప్పాడు. దీంతో సతీశ్ ఫిర్యాదు మేరకు బషీరాబాద్ పోలీసులు, తాండూరు రూరల్ సీఐ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ ప్రాథమిక వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్**

**KIDNEY STONES**

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం॥, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. సంప్ర: 7396856819, 7386886819.
NT-320424-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



అల్పాహారాన్ని తింటున్న విద్యార్థులు

# 'ముఖ్యమంత్రి అల్పాహారం' మరిన్ని బడుల్లో..

- అక్టోబర్ 6న 'రావిర్యాల' పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి
- అదే రోజు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభం
- రెండు రోజుల క్రితం మరో 39 ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం
- ఆనందంలో సర్కారు స్కూళ్ల విద్యార్థులు, తల్లిదండ్రులు

రంగారెడ్డి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): జిల్లాలో లాంఛనంగా ప్రారంభమైన సీఎం కేసీఆర్ అల్పాహార పథకం విజయవంతంగా సాగుతున్నది. అక్టోబర్ 6న మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల జడ్పీహెచ్ఎస్‌లో మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అదే రోజు జిల్లాలోని మిగతా ఏడు నియోజకవర్గాల్లోని ఒక్కొక్క పాఠశాలలో అల్పాహారాన్ని ప్రారంభించారు. దశలవారీగా ఈ పథకాన్ని విస్తరిస్తున్న ప్రభుత్వం ప్రస్తుతం జిల్లాలోని 47 పాఠశాలల్లో సక్సెస్ ఫుల్‌గా అమలు చేస్తున్నది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని అందిస్తుండడంతో ఆయా బడుల్లోని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాలో 1,43,500 మందికి చేకూరనున్న లబ్ధి..

సీఎం కేసీఆర్ అల్పాహార పథకం రంగారెడ్డి జిల్లాలోని 1,309 బడుల్లో అమలులోకి వస్తే 1,43,500 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నది. జిల్లాలో 881 ప్రాథమిక పాఠశాలల్లో 63వేల మంది, 181 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 15,500 మంది, 248 హైస్కూల్స్‌లో 65వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్టోబర్ 6 నుంచి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని ఒక్కో పాఠశాలలో ఈ అల్పాహార పథకం అమలవుతున్నది. దసరా తర్వాత పాఠశాలలు పునః ప్రారంభం కాగా ఈనెల 26 నుంచి మరో 39 పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో 31 పాఠశాలల్లో, మహేశ్వరం నియోజకవర్గంలో 8 పాఠశాలల్లో కొత్తగా ఈ పథకం అమలవుతున్నది. ప్రస్తుతం జిల్లాలోని 31 ప్రాథమిక పాఠశాలలు, 11 జడ్పీహెచ్ఎస్‌లు, రెండు ఎంపీపీఎస్‌లు, ఒక్కొక్కటి చొప్పున ఎంపీయూపీఎస్, యూపీఎస్, జీయూపీఎస్‌లలో ఈ పథకం దిగ్విజయంగా సాగుతున్నది.

### ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం

విద్యార్థులు ఖాళీ కడుపుతో పాఠశాలలకు వచ్చి పాఠాలు వినొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం గతంలోనే రాగిజావ, కోడిగుడ్డు, అరటి పండుతోపాటు సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నది. సీఎం కేసీఆర్ అల్పాహారంతో మరింత పౌష్టికాహారాన్ని అందించొచ్చనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఇది విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడనుండడంతోపాటు బడిపిల్లల హాజరు శాతం పెరిగి డ్రాపౌట్స్ గణనీయంగా తగ్గనున్నది. మానవీయ కోణంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ఈ పథకంపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ నాయకుడి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం

బొంరాస్‌పేట, అక్టోబర్ 27: మండలంలోని వడిచెర్ల స్టేజీ వద్ద శుక్రవారం ఉదయం ఫ్లైయింగ్ స్క్వాడ్ పోలీసులు ఓ కారులో తరలిస్తున్న రూ.5 లక్షల నగదును పట్టుకున్నారు. ఎన్నెమీదితండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు డాక్యానాయక్ ఉదయం 8గంటలకు మండలంలోని గట్టెగానితండాకు చెందిన నర్సింహానాయక్, గుబ్బడితండాకు చెందిన లావుడ్యా రవీనాయక్, టేకులగడ్డ తండాకు చెందిన శంకర్‌నాయక్‌లను వడిచెర్ల స్టేజీ వద్దకు పిలిపించాడు. వారిని కాంగ్రెస్ పార్టీలో చేరాలని.. తండాల్లోని ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వేయించాలని అడుగుతుండగా అక్కడికి చేరుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం కారు లో రూ.5 లక్షలు, కాంగ్రెస్ పార్టీ కండువాలను గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించింది. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. ఇదిలా ఉండగా డాక్యానాయక్ ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరాడు.